


## సెల్ఫీ సందడి

ఆకట్టుకునే నగలు.. ఆకర్షించే డిజైన్లతో మాదాపూర్‌లోని హెచ్ఐసీసీ వేదికైంది. మగువలు ఎంతగానో మెచ్చే సరికొత్త బంగారు ఆభరణాలు.. వస్త్రాలు మంగళవారం హై లైఫ్ ఎగ్జిబిషన్‌లో కొలువుదీరాయి. నటీమణులు సుభశ్రీ రాయగురు, అనుశ్రీయ త్రిపాఠి ముఖ్యఅతిథులుగా విచ్చేసి ప్రముఖ మోడల్స్, నిర్వాహకుడు డొమినిక్‌తో కలిసి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం నటీమణులతో మోడల్స్ సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు. ఈనెల 9వ తేదీ వరకు కొనసాగనున్నది. **- మాదాపూర్, నవంబర్ 7**




ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ప్రదర్శనను తిలకిస్తున్న నందమూరి బాలకృష్ణ

## క్యాన్సర్‌ను నయం చేయవచ్చు

**'బసవతారకం' ఆస్పత్రి చైర్మన్ నందమూరి బాలకృష్ణ**

బంజారాహిల్స్, నవంబర్ 7 : క్యాన్సర్‌ను మొదటి దశలో గుర్తిస్తే వంద శాతం నయం చేయవచ్చని, చాలా మంది రోగులు క్యాన్సర్ ముదిరిన తర్వాతనే వైద్యులను సంప్రదించడంతోనే ఎక్కువగా మరణాలు సంభవిస్తున్నాయని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి చైర్మన్ నందమూరి బాలకృష్ణ అన్నారు. మంగళవారం జాతీయ క్యాన్సర్ అవగాహన దినం సందర్భంగా బంజారాహిల్స్‌లోని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రిలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. క్యాన్సర్‌కు కారణాలు, లక్షణాలు, చికిత్సా పద్ధతులు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఏర్పాటు చేసిన ప్రదర్శనను ఆస్పత్రి చైర్మన్ నందమూరి బాలకృష్ణ ప్రారంభించారు. అనంతరం అమెరికాకు చెందిన రవి పొట్లూరి ఆస్పత్రిలోని రోగుల కోసం పంపించిన 30 వీల్‌చైర్లను నందమూరి బాలకృష్ణ స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సీఈవో డా.ఆర్‌వీ.ప్రభాకర్‌రావు, డా.కల్పనా రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీని అడ్డుకొని తీరుతాం..



మాట్లాడుతున్న మాల ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ జి.చెన్నయ్య

సుల్తాన్ బజార్, నవంబర్ 7: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణపై ఎటువంటి హామీలిచ్చినా ఆ పార్టీ ఎక్కడ సభలు పెట్టినా అడ్డుకొని తీరుతామని మాల ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ జి.చెన్నయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈ నెల 11న మాదిగల విశ్వరూప బహిరంగ సభకు దేశ ప్రధాని నరేంద్ర మోడీ హాజరు కాబోతున్న సందర్భంగా వర్గీకరణపై ఎలాంటి హామీనిచ్చినా అడ్డుకొని తీరాలని ప్రజా సంఘాల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి అనుమతి లేకపోవడంతో పోలీసులు వారిని అరెస్టు చేసి నాంపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన నాంపల్లి పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతూ ఎస్సీ వరీ కరణ చెల్లదని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును ప్రతి ఒక్కరు గౌరవించాలన్నారు. భారతీయ జనతా పార్టీ ఎస్సీ వర్గీకరణకు మద్దతునిస్తే పార్టీ సభలను అడ్డుకొని తీరుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జేఏసీ వర్కింగ్ చైర్మన్‌లు మన్నె శ్రీధర్‌రావు, గోపో జి రమేష్, బూరుగుల వెంకటేశ్వర్లు, గోకుల కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన ఎకో దివస్ అవగాహన కార్యక్రమం

సిటీబ్యూరో, నవంబర్ 7 (నమస్తే తెలంగాణ): ఆవు పేడతో మట్టి ప్రమిదల తయారీపై అవగాహన కల్పించేందుకు రెండు రోజుల పాటు ఎకో దివస్ కార్యక్రమాన్ని ఇంపాక్ట్ హబ్ ఏర్పాటు చేసింది. రెండో రోజు కార్యక్రమం మంగళవారం నాగోల్‌లో జరిగింది. వ్యర్థాలను తగ్గించడం, వనరులను సంరక్షించడం, స్థిరమైన పద్ధతులను ప్రోత్సహించడం.. తదితర విధానాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ఫర్ ఫ్యూచర్ సిటీస్ వ్యవస్థాపక అధ్యక్షురాలు కరుణా గోపాల్, ఇంపాక్ట్ హైదరాబాద్ విజినరీ వ్యవస్థాపక సభ్యులు డాక్టర్ నాగరాజు పాల్గొన్నారు.

# జోరందుకున్న నామినేషన్లు

- ఆర్‌వో కార్యాలయాల వద్ద సందడి
- పోలీసుల పటిష్ట బందోబస్తు

సిటీబ్యూరో, నవంబర్ 7(నమస్తే తెలంగాణ): నామినేషన్ల ప్రక్రియకు మరో మూడురోజులు మాత్రమే మిగిలి ఉన్నది. దీంతో బుధవారం నుంచి నామినేషన్ల ప్రక్రియ మరింత జోరందుకోనున్నది. ప్రధాన పార్టీలతోపాటు ఇండిపెండెంట్ అభ్యర్థులు, ఆయా పార్టీల రెబల్స్‌తో రిటర్నింగ్ అధికారి(ఆర్‌వో) కార్యాలయాల వద్ద సందడి నెలకొన్నది. ప్రధాన పార్టీలు భారీ ర్యాలీలతో వెళ్తూ నామినేషన్‌ను దాఖలు చేస్తుంటారు. ఆ సమయంలోనే అభ్యర్థులు సత్తా చూపించేందుకు ప్రయత్నిస్తుంటారు. ఇందులో భాగంగానే భారీ ర్యాలీలకు ఎన్నికల అధికారుల నుంచి అనుమతులు పొందుతున్నారు. ఒకేరోజు రెండు, మూడు పార్టీలకు చెందిన అభ్యర్థుల నామినేషన్లు ఉంటాయి. ఈ నేపథ్యంలో ర్యాలీలకు అనుమతి ఇచ్చే సమయంలో పోలీసులు ఆచితూచి అనుమతులు ఇస్తున్నారు. ఒక పార్టీ వెళ్లే రూట్‌కు, మరో పార్టీ వెళ్లే రూట్‌తో కలువకుండా, ఎదురు పడకుండా ఉండేలా ఆయా మార్గాలను, సమయాన్ని నిర్ణయిస్తున్నారు. ఒకేసారి రెండు ప్రత్యర్థి పార్టీల నాయకులు, కార్యకర్తలు ఎదురు పడితే ఇబ్బందులు ఎదురవుతాయి. రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల వద్ద కూడా నామినేషన్‌కు వచ్చే వారితో రద్దీగా ఉంటాయి, వంద మీటర్ల వరకు 144 సెక్షన్ అమలులో ఉన్నది. ఈ నేపథ్యంలో కార్యాలయాలకు 100 మీటర్లలో ఆంక్షలు ఉండటంతో కార్యకర్తలు అక్కడకు వెళ్లరు.. అయితే 100 మీటర్ల బయట ఎక్కువగా సిబ్బంది ఉంటారు.

### పటిష్ట బందోబస్తు

ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభంలోనే రిటర్నింగ్ కార్యాలయాల వద్ద ప్రత్యేక బందోబస్తును నిర్వహిస్తున్నారు. నామినేషన్ల ప్రక్రియ 10వ తేదీన ముగుస్తున్నా, స్క్రూటీని, విత్‌డ్రాకు 15వ తేదీ వరకు సమయం ఉన్నది. ఈనెల 15వ తేదీ వరకు రిటర్నింగ్ కార్యాలయం వద్ద ఆంక్షలు ఉంటాయి. ఇప్పటికే ఆయా రాజకీయ పార్టీలు ప్రచారంలో స్పీడ్ పెంచారు. సమయం తక్కువగా ఉండటంతో ఎవరి ప్రచార వ్యూహాలు వారు అమలు చేస్తున్నారు.



ఎన్నికల విధులు నిర్వహిస్తున్న జీహెచ్ఎంసీ అధికారులు

### మేడ్చల్ జిల్లాలో 13 నామినేషన్లు

మేడ్చల్, నవంబర్7(నమస్తే తెలంగాణ): రాష్ట్ర శాసన సభ ఎన్నికల ప్రక్రియలో భాగంగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిధిలోని ఐదు నియోజకవర్గాల్లో మంగళవారం 13 నామినేషన్లు దాఖలైనట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ గౌతమ్ వెల్లడించారు. మేడ్చల్ నియోజకవర్గం నుంచి 6, మల్కాజిగిరి 2, కుత్బుల్లాపూర్ 2, కూకట్‌పల్లి 1, ఉప్పల్ 2 నామినేషన్లను సంబంధిత ఆర్వోలు స్వీకరించనట్లు తెలిపారు. నామినేషన్ల ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ సంఘటలు జరగకుండా ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ వివరించారు. నామినేషన్లు ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు జిల్లాలో 32 నామినేషన్లు దాఖలైనట్లు తెలిపారు.

### 34 మంది అభ్యర్థులు.. 38 నామినేషన్లు దాఖలు

**ఎన్నికల అధికారి రొనాల్డ్‌రాస్**

శాసనసభకు జరిగే ఎన్నికలకు గానూ హైదరాబాద్ జిల్లాలో నాలుగవ రోజు మంగళవారం 34 మంది అభ్యర్థులు 38 నామినేషన్లు దాఖలు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్‌రాస్ తెలిపారు. కాగా, ఎన్నికల సంఘం జారీ చేసిన నోటిఫికేషన్‌ను అనుసరించి ఈనెల 10వ తేదీ వరకు స్వీకరించే నామినేషన్లను మధ్యాహ్నం 3 గంటల వరకు సంబంధిత రిటర్నింగ్ అధికారి కార్యాలయాల్లో అభ్యర్థులు దాఖలు చేయాల్సి ఉంటుంది.

# నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశా

**మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్**



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

అమీర్‌పేట్, నవంబర్ 7: నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ.. అభివృద్ధిపై దృష్టి సారిస్తే నియోజకవర్గాన్ని ఎంతలా అభివృద్ధి చేయవచ్చనే విషయాన్ని సనత్‌నగర్ సాధించిన ప్రగతిని పరిశీలిస్తే తెలుస్తుందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. నియోజకవర్గ చరిత్రలో చుట్టపు చూపులా వచ్చిపోయే నాయకులే తప్ప, అభివృద్ధిపై పూర్తి స్థాయి దృష్టి సారించిన నాయకులే లేకుండా పోయారన్నారు. మంగళవారం సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మిరెడ్డి అధ్యక్షతన 60 ఫీట్‌రోడ్డు, డీఎన్ఎం కాలనీలలో జరిగిన కార్యక్రమాల్లో స్థానిక యువకులు పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పార్టీలో చేరిన యువకులకు గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధి కోసం రూ. 1400 కోట్లు వెచ్చించామని, చేసిన అభివృద్ధి చూస్తే అర్థమవుతుందన్నారు. అభివృద్ధి అనేది నిరంతరం కొనసాగే ప్రక్రియ అని ప్రజలు బీఆర్ఎస్ పార్టీకి అండగా నిలవాలన్నారు. దశాబ్ద కాలంగా బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నిరంతరం కొనసాగాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని కోరారు.

## అభివృద్ధిలో తెలంగాణ ఆదర్శం



ఇంద్రానగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న మలక్‌పేట బీఆర్ఎస్ అభ్యర్థి తీగల అజిత్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ సునరితారెడ్డి తదితరులు

మలక్‌పేట, నవంబర్ 7 : తొమ్మిదేండ్లలో సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి దేశానికే ఆదర్శంగా నిలిపారని, మరోసారి బీఆర్ఎస్‌కు పట్టం కట్టాలని మలక్‌పేట బీఆర్ఎస్ అభ్యర్థి తీగల అజిత్‌రెడ్డి అన్నారు. ప్రచారలో భాగంగా మంగళవారం ఆయన ఇంద్రానగర్, లక్ష్మీనగర్, ఎస్‌బీహెచ్ కాలనీల్లో మాజీ కార్పొరేటర్ తీగల సునరితారెడ్డి, మార్కెట్‌కమిటీ చైర్‌పర్సన్ అంగోతు అనితానాయక్, మాజీ చైర్‌పర్సన్ రాధ, డైరెక్టర్లు రాము యాదవ్, సల్మాన్ మహ్మద్‌ఖాన్, రాహుల్, తీగల స్వాతి రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా అభ్యర్థి తీగల అజిత్ రెడ్డి మాట్లాడుతూ... ప్రజా సంక్షేమంలో తెలంగాణ అన్ని రాష్ట్రాలకంటే ముందు వరుసలో ఉన్నదని, అందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ దార్శనిక పాలనే కారణమన్నారు. ఆదరించి గెలిపిస్తే అందుబాటులో ఉండి సేవచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీల సంక్షేమ సంఘాల నాయకులు నవీన్ యాదవ్, పురుషోత్తం, దేవిడి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రఘునందన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రవీణ్, శ్రీధర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పవన్, విష్ణు, శివ,శశిధర్‌రావు, సరిత, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వేగశ్రీలో దీపావళి.. ధనత్రయోదశి ఆఫర్లు

జూబ్లీహిల్స్, నవంబర్ 7 : జూబ్లీహిల్స్‌లోని వేగశ్రీ గోల్డ్ అండ్ డైమండ్స్‌లో దీపావళి.. ధనత్రయోదశి సందర్భంగా ఆకర్షణీయమైన ఆఫర్లు ప్రకటించినట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12వ తేదీ వరకు రూ.2 లక్షల బంగారు ఆభరణాల కొనుగోలుపై 1 గ్రామ్ గోల్డ్ కాయిన్ ఉచితంగా అందించనున్నట్లు పేర్కొన్నారు. దీంతోపాటు డైమండ్ జ్యువెల్లరీ క్యారెట్ రూ.55,999 మాత్రమే లభ్యమవుతున్నట్లు, పోల్కి జ్యువెలరీపై ఎటువంటి మేకింగ్, వేస్టేజ్ చార్జీలు ఉండవని ప్రకటించారు. దేశం నలుమూలల నుంచి ప్రముఖ డిజైనర్స్ రూపొందించిన ఎన్నో రకాల ఆభరణాలను ఈ ప్రదర్శనలో అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో బంగారు, వజ్రాభరణాల షోరూమ్‌ను దిగ్విజయంగా నడుపుతున్నట్లు, వేగశ్రీ తెలుగు రాష్ట్రాల్లో మరికొన్ని నగరాలకు విస్తరించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దీపావళి, ధనత్రయోదశి ఆఫర్లను ఆభరణాల ప్రియులు సద్వినియోగం చేసుకోవాలని ప్రకటనలో కోరారు.

## టీటీ కెప్టెన్‌గా విఘ్నయ్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: తెలంగాణ అంతర్ జిల్లాల టేబుల్ టెన్నిస్ టోర్నీకి ఈ నెల 18న తెరలేవనుంది. సికింద్రాబాద్ గుజరాతి సేవా మండల్ టీటీ అకాడమీ వేదికగా టోర్నీకి ఏర్పాట్లు జరిగాయి. ఇందులో హైదరాబాద్ పురుషుల జట్టుకు విఘ్నయ్‌రెడ్డి కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. మహిళల జట్టుకు నిఖిత, బాలుర జూనియర్ జట్టుకు తరుణ్ కేథారీనాథ్, రంగారెడ్డి పురుషుల టీమ్‌కు జుబైర్ ఫారూఖీ నాయకత్వం వహిస్తారు.




మీడియా సమావేశంలో పతకాలు ప్రదర్శిస్తున్న ప్రతిభ

## చెస్ బాక్సింగ్‌లో సత్తాచాటిన తెలంగాణ ప్రతిభ

ఖైరతాబాద్, నవంబర్ 7: చెస్ బాక్సింగ్ పోటీల్లో తెలంగాణకు చెందిన క్రీడాకారిణి ప్రతిభ తక్కడపల్లి సత్తా చాటారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పోటీలకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. గత నెల 28 నుంచి ఈనెల 3వ తేదీ వరకు ఇటలీలోని రిచోనిలో జరిగిన అంతర్జాతీయ చెస్ బాక్సింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించినట్లు తెలిపారు. భారతదేశం తరపున ఈ పోటీల్లో తొమ్మిది మంది పాల్గొంటే తెలంగాణ నుంచి ఏకైక క్రీడాకారిణిగా తాను వెళ్లానని తెలిపారు. కామారెడ్డి జిల్లాకు చెందిన తాను పటియాలలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్‌లో బాక్సింగ్ నేర్చుకున్నానని, ప్రస్తుతం మొదటి మహిళా బాక్సింగ్ కోచ్‌గా పని చేస్తున్నానని తెలిపారు. ఇప్పటికే కిక్ బాక్సింగ్, థాయ్ బాక్సింగ్, మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్‌లో వరుసగా బంగారు పతకాలు సాధించానన్నారు. తనకు శ్రీవేంకటేశ్వర కళాశాల చైర్మన్, దివంగత ప్రధాని పీవీ నరసింహారావు మనుమరాలు అజితా సురభీ సహకారం అందించారన్నారు. త్వరలోనే దేశంలో జరుగనున్న ఆసియా క్రీడల్లో పాల్గొననున్నానని, ప్రభుత్వం తరపున తగిన సహకారం అందించాలని ఆమె కోరారు.